# చీకట్లో పచ్చగడ్డిమోపు

కవికొండల వేంకటరావు

"స్వాతంత్ర్యము స్వాతంత్ర్యము" అని మనం అంటామే "ఇది ఎందులోవుంది? మూడురంగుల జెండా ఎత్తడంలోవుందా? ఏడుకొండలవాడి మహిమలో వుందా?" అని యీ ఎనిమిదవ వార్షికోత్సవ సందర్భంలో ఆలోచిస్తూ అలా 15-8-1955న వీచే శుభోదయ మందమారుతానికి తలూపుతూ యావత్ భారతావని ప్రజల్ని ఒక్కసారిగా తిలకించాను!

వాళ్లందరూ ఏదో చైతన్యం, వినూతనంగా పొందుతూవున్నట్లు, ఎవళ్లకు వాళ్లే ఏదో ఉత్సాహంతో వున్నట్లు నామనోనేత్రానికి కనపడ్డారు. కాని అసలు నేత్రానికి ఎట్టయెదుట మరో దృశ్యం ప్రత్యక్షమయింది. దైనికచర్యలో దందహ్యమానమౌతూ, త్వరత్వరగా పచ్చగడ్డి కోస్తూవున్న ఒకానొక యువతి గోచరించింది ఆమెకేసి మఱో యువకుడు ఆ పచ్చికబీడు దున్నడానికి సిద్ధంగా వున్నవాడు చూస్తూవున్నాడు. యువకుడు నాగలి పన్ని ఎద్లకోసం వెదుకుతూ "కోసికోవడం ఇంకా కాలేదా?" అన్నాడు. "ఈ చెక్కనీ- చెంగలిగడ్డి మొలవనివ్వరాదంట్రా? నన్నే లేవగొట్టాలా?" అంది కొడవలి కోత మాని నడ్డి ఎత్తి, సన్నని గొంతుకతో ఆ పడుచు.

యువకుడు పడుచుకేసి పరకాయింపుగా చూచాడు. ఇద్దరూ ఆ స్థలం దురాక్రమణ కావిస్తూవున్నట్లే కనబడ్డారు. వాని యూహ "ఎక్కడ దున్నితేం నేలకదా?" అని. దాని యూహ "ఎంత కోస్తేం గడ్డిగదా?" అని ఎకరం నేల దున్నినా దున్నడమే, పట్టెడుగడ్డికోసినా కొయ్యడమే ఎక్కడో ఓ కాడ ఆపూట!" అన్నట్లు తహతహమున్నారు వాళ్లద్దరూ.

ఆ ఉబలాటం ఆపూట మహత్తు అని నా ఆలోచన పోసాగింది. అప్పటి కెనిమిదేళ్లై, భారతయూనియన్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. మూడు రంగులజెండా మురిపెంతో, ధర్మ ప్రసిద్ధ ధర్మచక్రం కాపాడుతూంటే, ఇంటింటా, వాడవాడా, ఎగురుతూవుంది. పైనుంచి పూలవర్షం కురుస్తూవుంది నాయకులమీద! ఋతువు పోకడకూడా బహు రమ్యంగా వుంది.

ఆదారినే ఒక ఉద్యోగి వెడుతూవున్నాడు. యువకుడు నాగలి తనది కానట్టుగా నిలబడివున్నాడు. "లచ్చి అన్నది పచ్చగడ్డిలోమాత్రం వుండదా" అని కొడవలి పదును పడుతూవుంది ఆయువతి. "ఇంత భీతితో బ్రతికే మనం ఈప్రపంచంలో వుండరాదనుకుంటాను" అన్నాడు యువకుడు. యువతికూడా ఆలాంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చుతూ కొసమాట ఒకటి వొదిలింది; "ఆరికేం రా? ఆరు మహారాజులు! నెలకు వెయ్యి రూపాయలు జీతంగా పుచ్చుకుంటూ, ఈపొద్దు ఎక్కడికో జాతీయ పతాక మెత్తడానికి వెడుతూండబోలు. మనకు రెక్కాడితేగాని డొక్కాడదు! ఇలా ఒక మోపు పచ్చగడ్డి కోసుకు వెడితేగాని మాపటికి నాకు బియ్యమే వుండవు. నీ భాగ్య మెలాటిదో గాని!" అంది. ఉద్యోగి వారిని దాటాడు యువకుడు భూమిని, మఱీ ఎద్దు లెక్కడ దున్నకుండానే పన్నిన నాగలిని విడదీసి మొత్తకు మొత్తా, మోకుకు మోకూ మోసికొంటూ నిష్క్రమించాడు. యువతి ఆ బీడుమీద స్వేచ్ఛగా పచ్చగడ్డిమఱి అడ్డు లేకుండా, కోసికోసాగింది. ఆమె జోలీ కొంటె ఎవరికీ మరి అక్కర్లేదట్లు ఆ పగలంతా గడిచిపోయింది. కారణం, ఆమె అక్కడనుంచి లేవకుండా ఆనాడు తదేక దీక్షతో ఆ పచ్చగడ్డినంతనూ కోయడమే. మర్నాడు కోస్తే ఎవ రేమందురో? ఆనాడు అంతా ఆమెకు స్వేచ్ఛే!

సాయంకాలపు సూర్యుడు ఇంకా క్రిందకు పడమటకు దిగిపోతూ ఆమె ముఖము మీదకో వెలుగు బఱపింది. ఆమె ఒక చిరునవ్వు లోలోన నవ్వుకొంది. మోపెత్తుకుంది. పట్నం వెంపుకు నడచివెళ్ళసాగింది.

పట్నంలో ఏ యింటిమీద చూచినా, ఏ రచ్చమీద చూచినా, 'జాతీయ పతకాలు ఎగురుతూ వున్నాయి జండాలు బలేగా ఎగురుతూ వున్నాయి. ప్రతిచోటా పట్నంలో బలేగా ఎగురుతూవున్నాయి. పల్లెటిపట్టుల్ని ఆమె గూడెంకాడ కూడా ఎగురుతూందేమో ఆమె కానలేదు. చీకటి పడ్డాక్కే, బాగా చీకటిపడ్డాకే ఆమె తిరుగా యిల్లు చేరుకోవడం. పొద్దున్నే చద్దివణ్ణము మూటకట్టుకుని తెచ్చుకుని ఏ ఏటిపంచనో తిని, ఎక్కడెక్కడి పచ్చగడ్డి కోసుకు, మోపుకట్టుకు, పగల్లా పాటుపడి, పట్నంలో అంగడిలోఅమ్ముకుని, ఆ డబ్బులు పెట్టి కొన్ని బియ్యం, ఉప్పూ, మిర్చి వగైరాలు కొనుక్కొని ఆ సరుకుతో తన పల్లెను చేరుకోవడమే ఆ ఆడమనిషియొక్క దైనందిన కృత్యము.

ఏనాడూ రాత్రి బాగా చీకటి పడితేనే గాని ఆ పడుచుకు పచ్చగడ్డిమోపమ్ముడు కాదు అసలు ఏ పడుచులకైనా చీకటి పడ్డాకే పచ్చగడ్డి మోపు లమ్ముడుకావడం. అందులోనూ ఆ పడుచుకు మఱీ చీకటి పడాలి!

ఆనాడు మఱీ మఱీ చీకటిపడినా ఇంకా అమ్ముడుకాలేదు ఆ పడుచుయొక్క పచ్చగడ్డిమోపు. ఇక అమ్ముడు కాదేమో ఆనాడు తాను పస్తు పడుకోవలసి వస్తుందేమోనని అనుకొంది ఆమె అది స్వాతంత్ర్యదినం అనుకొంది. అనుకుంటూనే ఎదిరింటిమీద ఎగిరే జాతీయ పతాకంకేసి చూచింది. అది టపటపా కొట్టుకొంటూవుంది. ఆ పడుచు తన గుండెలమీద చేయివేసుకుంది. అవన్నీ లబ్ లబ్ కొట్టుకొంటూ వున్నాయి ఫరవాలేదనుకుంది. మోపువంక చూచింది. మోపు ఆర్ద్రంగా, హరితంగా కానవచ్చింది. ఎవరో వచ్చేజాడయింది. ఎదురు చూచింది

ఆమె అనుకోలేదు ఒక తెల్లని ఆంబోతు మెళ్లో ఎఱ్ఱటి మెట్టతామర పూలదండతో వచ్చి వచ్చి, ఆ ఆకుపచ్చని గడ్డిమోపును ఊడలాక్కొని, గోడ్డంట చిందర వందరగా తింటూపోసాగింది. పడుచుపిల్ల పరుగు పరుగున వెంటాడిస్తూ దాన్ని ఒక్క జబురు జబిరింది తన అరచేతో! "అలాంటివే ధర్మచక్ర ప్రయోగాలు" అని అన్నాడు. ఎక్కడున్నాడో ఆ చీకట్లో ఆ మహానుభావుడు!

పడుచుపిల్ల పకాల్న నవ్వుతూ "నువ్విక్కడే యున్నావా? నీకేనా ఇంతగోడు" అంది ఉదయాన్నే తాను చూచిన యువకుని గంటూ. "ఊరికే కోసుకొచ్చిన గడ్డి ఊరికే తింది ఊరాంబోతు! నా దైతే పొద్దున్న నాగలి కట్టెయ్యకపోయావాణ్ణా?" అన్నాడు యువకుడు. పిల్ల "నీ నాగలి కట్టినా అంతే గుక్క!— నేనంటే ఊరికే తిననిచ్చాను గాని రేపు తిననిస్తానురా!" అంది. ఆంబోతు మాట్లాడకుండా ఆకుపచ్చని గరికను నోట్లో నెమరువ రాలుస్తూ ఆలా నిలబడిపోయింది పూర్తి అయిన జాతీయ పతాకంలాగ! ★